
క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఐక్యంగా ఉంటు కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ నార్త్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొగుల రాంబాబు ఆధ్వర్యంలో రూపొందించి న నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, కాలనీవాసులు రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చంపాపేట : చంపాపేట డివిజన్ పవన్‌పురికాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆంగ్ల నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, కోశాధికారి మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కరాచారి, సలహాదారులు సత్యనారాయణరెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయించండి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఎస్ఎఫ్ఐ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే కళాశాల మంజూరీకి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, మహేష్, శివ, నాగరాజు, సాయికుమార్, శివశంకర్ పాల్గొన్నారు.


అయ్యప్ప పూజలో మేయర్ పారిజాతానర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన బాలాపూర్

● మేయర్ నివాసంలో వైభవంగా మహాపడిపూజ

సరూర్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామం గురువారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. స్వామిమే శరణమయ్యప్ప అంటూ స్వాములు భజనలు చేయగా భక్తులందరూ గళం కలిపారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి నివాసంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజతో బాలాపూర్‌లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. బాలాపూర్ సన్నిధానం గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ కుటుంబ సభ్యులు నర్సింహారెడ్డి, దయాసాగర్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, యాదగిరిరెడ్డి, రాము, రవి, ఆశిష్, బంటి తదితరులు ఆయా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప పడి వెలిగించి హారతి ఇచ్చారు. అయ్యప్పస్వాములకు అల్పాహారం వడ్డించగా, మిగతా భక్తులకు అన్నదానం చేశారు.

బాలాజీనగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కొత్తపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బాలాజీనగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరైనా పైప్‌లైన్ పనులు మొదలు కాలేదని కాలనీవాసులు ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ, కార్యదర్శి స్వామి, నాయకులు మంచి రాజేష్, యాదయ్య, గణేష్, సూర్య పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

వనస్థలిపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్స్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కమిషనర్ (హెల్త్) పంకజ, అధికారులు


మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్


సింగరేణికాలనీలో నివాళులర్పిస్తున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్


నాగోల్‌లో నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్


సైదాబాద్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

● ఉపాధ్యాయులకు సన్మానం

ఆంధ్రజ్యోతి, జోన్‌బృందం : ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే మహిళలందరికీ స్ఫూర్తినిచ్చిందని పలువురు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సావిత్రిబాయి విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో..

బాలికల విద్యాభ్యాసం కోసం పోరాడిని సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, ఇది యావత్ రాష్ట్రానికి గర్వకారణమని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సరస్వతి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, టీపీఎస్ లాలప్ప, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మేనేజర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


డీబీఆర్ యువజన ఆధ్వర్యంలో అల్కాపురి కాలనీ టీఎన్ఆర్ చౌరస్తాలో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, శేఖర్ ముదిరాజ్, లక్ష్మి తదితరులు

అల్మాస్‌గూడలో..

సావిత్రీబాయి పూలే జయంతిని అల్మాస్‌గూడలో బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు కేతావత్ బహుగుణనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి బచ్చిగల్ల నితీశ్, కిషోర్, పల్లె కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో, మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో, అనాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో, కుంట్లూర్, తట్టిఅన్నారం, ఆర్ఎన్ఆర్‌కాలనీలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో..

కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో మహిళా ఉపాధ్యాయులను సహ ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


సరూర్‌నగర్‌లో సావిత్రిబాయి మహిళా ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు యాంద్ర కల్పన ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, బీసీ సంఘాల నేత ఆకుల అరవింద్

సైదాబాద్ సింగరేణికాలనీలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో..

హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బీకాం చదువుతున్న అయేషా సావిత్రిబాయి వేషధారణతో అలరించింది. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరా, అకడమిక్ కోఆర్డినేటర్ నర్సింహ పాల్గొన్నారు.


అల్మాస్‌గూడలో సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న బహుగుణనాయక్ తదితరులు


మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినులకు సన్మానం చేస్తున్న తోటి ఉపాధ్యాయులు


బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు


సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సమయానుసారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలు జరగక నగర శివారులో సమస్యలు తిష్టవేశాయని వాటిని పరిష్కరించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి రెండు డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. హయత్‌నగర్ మదర్ డెయిరీ గుండా ఉన్న ట్రంకు లైనుకు ఇరవై సంవత్సరాలుగా కొలన్ శివారెడ్డికాలనీ, సిద్ధి వినాయకనగర్, దత్తాత్రేయనగర్, వసంతనగర్‌తో పాటు 10కాలనీల మురుగునీరును ట్రంకులైనులో కలపకుండా మదర్‌డెయిరీ అధికారులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం అక్కడికి వెళ్లిన ఈటల మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎండీ కృష్ణలతో మాట్లాడారు. పది కాలనీలకు చెందిన మురుగునీటిని ట్రంకులైనులో కలిపించారు. ఈ సందర్భంగా పలువురు ఈటలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వనగరంలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని అన్నారు. వీధి దీపాలు, రోడ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వరద కాలువల పనులు నిలిచిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో జల మండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం జీవన్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, బండారు భాస్కర్, కొండల్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, శ్రీధర్‌గౌడ్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మదర్ డెయిరీ ట్రంకులైను వద్ద నెలకొన్న మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సీఎంఆర్ కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మ దహనం

చాదర్‌ఘాట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి కండ్లకోయలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినుల బాత్‌రూంలో వీడియో రికార్డింగ్ చేయడాన్ని పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఇందుకు నిరసనగా శుక్రవారం పీడీఎస్‌యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సీఎంఆర్ కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె.గణేష్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుడు మందుల సైదులు మాట్లాడుతూ విద్యార్థినుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తూ వారి రక్షణ పట్ల సీఎంఆర్ కళాశాల యాజమాన్యం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఇంత జరుగుతుంటే కళాశాల యాజమాన్యం స్పందించకుండా విద్యార్థినులు మాట్లాడితే వీడియోలు బయటికి వస్తాయని బ్లాక్‌మెయిల్ చేయడం అంటే విద్యార్థినుల పట్ల కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును వారు తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సీఎంఆర్ విద్యాసంస్థలను సీజ్ చేసి అందుకు కారకులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సీఎంఆర్ కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ నగర ప్రధాన కార్యదర్శి గణేష్, మందుల సైదులు తదితరులు

రిపబ్లిక్ డే పరేడ్‌కు మల్లీశ్వరి ఎంపిక



హయత్‌నగర్ : హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కురువ మల్లీశ్వరి ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ వారు నాలుగు నెలలుగా నిర్వహించిన ఎన్‌సీసీ భిన్నమైన క్యాంపులలో కురువ మల్లీశ్వరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు మల్లీశ్వరిని అభినందించారు.

కుమార్తెపై తండ్రి లైంగికదాడి

● జీవిత ఖైదు విధించిన పోక్సో కోర్టు

హైదరాబాద్ సిటీ : కామంతో కళ్లు మూసుకుపోయి కుమార్తెపై లైంగిక దాడి చేసిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గుండు అంజయ్య(40) కుటుంబంతో కలిసి సరూర్‌నగర్ ప్రాంతంలో ఉంటూ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో మైనర్ అయిన తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అంజయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు అంజయ్యకు జీవిత ఖైదుతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్ల సునీత తెలిపారు.

ఫోర్త్ సిటీ పనులు వేగవంతం : కేఎల్ఆర్

ఎల్‌బీనగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా మార్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కేఎల్ఆర్‌లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురు కాసేపు ముఖ్యమంత్రితో మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్ సిటీ, గ్రీన్‌ఫార్మా, స్కిల్ యూనివర్సిటీ, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ హబ్స్, ఇండస్ట్రియల్ పార్క్స్, మెట్రోరైలు రాకతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు చేపట్టనున్న 330 అడుగుల రోడ్డు, కంపెనీలకు భూసేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని సీఎం సూచించినట్లు కేఎల్ఆర్ తెలిపారు. ఇప్పటికే జెన్నాయిగూడ, కందుకూరు మండల రైతులను భూసేకరణకు ఒప్పించిట్లు ఆయన తెలిపారు. రైతులు నష్టపోకుండా పరిహారం, ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఇస్తామని హామీ ఇచ్చినట్లు కేఎల్ఆర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో

విద్యాసంస్థల సంఖ్యను పెంచాలి: మంత్రి పొన్నం

అఫ్జల్‌గంజ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో నిర్వహిస్తున్న విద్యాసంస్థల సంఖ్యను మరింత పెంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎగ్జిబిషన్ సొసైటీకి సూచించారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నుమాయిష్‌ను మంత్రి డి. శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ హనుమంతరావు (వీహెచ్)తో కలిసి బెలున్లు ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఇరవై విద్యాసంస్థలు కొనసాగుతుండగా వాటిని 30 వరకు పెంచాలని కోరారు. అందుకు అవసరమయ్యే అనుమతులు, ఇతరాత్ర సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎగ్జిబిషన్ స్థలం లీజు విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడతానన్నారు. ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కాలేజీగా మార్చి అడ్మిషన్లు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య తెలుగు వారందరినీ ఒకే వేదికమీదకు తెచ్చింది. ఆ సంస్థ 12వ ద్వైవార్షికోత్సవ మహాసభలు శుక్రవారం నోవాటెల్‌లో ప్రారంభమయ్యాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, హాంకాంగ్, సింగపూర్, గల్ఫ్‌దేశాల తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మారిషస్, మలేషియా, మయన్మార్ తదితర దేశాల్లో రెండు శతాబ్దాల కిందట వలసవెళ్లిన వారి వారసులు విచ్చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వామనగుంటలు, అష్టాచెమ్మ, వైకుంఠపాళి తదితర ఆటలు, బొమ్మల కొలువులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు మారిషస్ నుంచి 23మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంగ్లేయుల పాలనలో సుమారు 1830లలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి కొందరు మారిషస్‌కు కూలీలుగా వలస వెళ్లారు. వారందరి సంతతికి చెందిన నాలుగో తరం ఆ దేశంలో 50వేల మందికిపైగా ఉన్నట్లు మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధి సింహాద్రి అచ్చయ్య తెలిపారు. భాద్రపద పాడ్యమి రోజు నుంచి 40రోజుల పాటు దుర్గాపూజ, గోవిందదీక్ష మా పూజాది కార్యక్రమాల్లో భాగం. శ్రీరామ నవమి, ఉగాది పండుగలు ఘనంగా జరుపుకుంటాం అని మారిషస్ తెలుగు సంఘం అధ్యక్షుడు హెవిన్ గురయ్య 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా వివరించారు. 'మాకు కులాలంటే ఏమిటో తెలియదు. తెలిసిందల్లా తెలుగువారిమని మాత్రమే. తెలుగువారిగా మేమంతా కలిసున్నాం' అని మారిషస్‌లో తెలుగు బోధిస్తోన్న రాజవంతీ పేర్కొన్నారు. ఆ దేశంలో 4లక్షల మందికిపైగా తెలుగువారు ఉన్నట్లు మలేషియా తెలుగు సంఘం సలహాదారు అచ్చయ్య కుమార్‌రావు తెలిపారు. మలేషియాలోని తెలుగు జనాభాలో 30 శాతంకుపైగా దళిత నేపథ్యం కలిగినవారే. పెళ్లిళ్లలోనూ కులాలను పట్టించుకోం. నూకాలమ్మ, పైడయ్య, తదితర దేవుళ్లను ఆరాధిస్తాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని మా పూర్వీకుల మూలాలనూ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని ఆయన చెప్పారు. తెలుగు సమాఖ్య మహాసభల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని దుబాయ్ నుంచి వచ్చిన వేమూరి రాజేష్ అన్నారు. అమెరికాకు ఏ మాత్రం తీసిపోని విధంగా తెలుగునాట అత్యున్నత ప్రమాణాలతో నేత్రవైద్యాలయాన్ని నెలకొల్పడం చాలా గర్వంగా ఉందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రుల వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా, రెడ్డీస్ ల్యాబ్ ఎండీ జీవీ ప్రసాద్, గ్రాన్యూల్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, స్కైరూట్ ఎయిరోస్పేస్ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్, ఐ ప్రోస్ట్ వ్యవస్థాపకురాలు సుందరి పాటిబండ్ల తదితరులు పాల్గొని వారి వ్యాపార ప్రస్థానాన్ని వివరించారు. సమావేశానికి యార్లగడ్డ హరిశ్చంద్రప్రసాద్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో జరిగిన దాడి

ఆకస్మికంగా జరిగింది కాదు : వక్తలు


మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

పంజాగుట్ట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో ఇటీవల జరిగిన పుస్తక ప్రదర్శనలో అనువాదకులు, సంపాదకులు, ప్రచురణకర్తల మీద జరిగిన దాడి ఆకస్మికంగా జరిగింది కాదు. తెలంగాణలో మత విద్వేషాలు సృష్టించి అధికారంలోకి రావాలనే పథకం ఉంది. మూక దాడి సంస్కృతి సమాజానికి ప్రమాదం. కుట్రపూరితంగా టార్గెట్‌గా చేసుకుని చేసే దాడులను కలిసి కట్టుగా ఎదుర్కొందామని' పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం, తెలంగాణ పర్ పీఏస్, యూనిటీ ఆధ్వర్యంలో 'పుస్తక రచన, ప్రచురణ, విక్రయాలపై మతోన్మాద శక్తుల దాడిని ఖండిద్దాం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో జరిగిన సంఘటనలు ఆకస్మికంగా జరిగిన సంఘటన కాదని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన రక్షణలను మార్చడానికి ప్రయతించే శక్తులే భావ ప్రకటన స్వేచ్ఛ మీద దాడికి పూనుకుంటున్నాయని అన్నారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక నిర్మాణాత్మకమైన కృషి జరగాలని, కవులు, రచయితలు, సంపాదకులు, సామాజిక కార్యకర్తలపై దాడి ఇది మొదటిది కాదు చివరిది కాదు అని, ఇప్పటి వరకు మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఫాసిజం పునాదులు మనిషి భయంతో ఉంటాయని అన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ వారికి ఒక్క దేవుడు లేడని, చాలా మంది దేవుళ్ళు ఉన్నారని, అయ్యప్ప కూడా వారి దేవుడు అయ్యాడని అన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అస్థిత్వాల మధ్య చీలిక ఉండడంతో మనం బలహీనంగా కనబడుతున్నామని అన్నారు. రమా మేల్కొటే, వివిధ సంఘాల నాయకులు సజయ, వి.సంధ్య, సారా మాథ్యూ, కల్పనా కన్నాబిరామన్, తిరుణగరి దేవకి దేవి, అరుణ తదితరులు మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, కవులు, రచయితలు వి.ఎస్ బోస్, చూపు కాత్యాయని, సత్యవతి, కృష్ణ కుమారి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, స్టాలిన్, కేవీఎల్, విబి జ్యోతి, జితిన్ కుమార్, శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.